ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- యూఏఈ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వాణిజ్య బంధం పెంచుకునే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయిలో చర్చలు జరిపారు.

- కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

- ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్.. సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో ఈరోజు పాల్గొన్నారు.

- పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రేపటికి మరింత బలపడతుందని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

====================

దుబాయ్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యూఏఈ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో ఈరోజు సమావేశమయ్యారు. యూఏఈ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వాణిజ్య బంధం పెంచుకునే అంశంపై ఇరువురు నేతలు చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాలన, పౌరసేవలను మరింత మెరుగుపరిచే అంశంపై చర్చలు జరిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త ఆవిష్కరణలు, అంకుర సంస్థలను ప్రోత్సహించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్- దుబాయ్ సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై అంగీకారం కుదిరింది. లాజిస్టిక్స్, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు, నూతన భాగస్వామ్యాల ఏర్పాటుపై ఇరువురి మధ్య చర్చ జరిగింది.

====================

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహిస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు ఆమె కర్నూలులో సహచర మంత్రి రాం ప్రసాద్ రెడ్డితో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం 20 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రమాదం నుండి ఇద్దరు డ్రైవర్లతో సహా 22 మంది బయటపడ్డారని, స్వల్ప గాయాలతో 12 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని, 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామని చెప్పారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు, ప్రమాద కారణాలు అన్వేషించేందుకు 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామని హోంమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...28 సెకన్లు)

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. దుర్ఘటనలో రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు 5 లక్షలు, క్షతగాత్రులకు 2 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేయనున్నామని తెలిపారు.

====================

ఆంధ్రప్రదేశ్ కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన మెల్‌బోర్న్‌లో.. ఆస్ట్రేలియా, ఇండియా బిజినెస్ కౌన్సిల్ (AIBC) ప్రతినిధులతో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్రంలో అనుభవం కలిగిన, దార్శనిక నాయకత్వం ఉందని, పెద్ద ప్రాజెక్టులను రాష్ట్రానికి ఎలా తీసుకురావాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలుసని అన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉందని, దీనిద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సహకారం లభిస్తుందని చెప్పారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని, ఈ పెట్టుబడుల ద్వారా త్వరలోనే ప్రధమ స్థానంలో నిలుస్తుందని మంత్రి లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

====================

అర్హత కలిగిన ప్రతి ఒక్కరి సొంతింటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ లోని క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ఆయన, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలన్నారు. అర్హులను గుర్తించి, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రతి పేదవాడు దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. అంతకు ముందు.. మంత్రి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

====================

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

సాంకేతిక పరిజ్ఞానం ద్వారా బియ్యం అక్రమ రవాణాను అరికడతామని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు తిరుపతిలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. గోడౌన్లు, రేషన్ షాపులలో త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంగన్వాడీ స్కూల్స్ కి, హాస్టల్స్ కి సరఫరా చేసే బియ్యం నాణ్యత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. బియ్యం అక్రమ రవాణాలో రాజకీయ నాయకుల ప్రమేయంపై ప్రభుత్వం నిఘా ఉంచిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరలోనే జిల్లాల వారిగా పర్యటిస్తారన్నారు. కర్నూలులో బస్సు ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమని, ప్రమాద ఘటనపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ చేపట్టిందని మంత్రి తెలియజేశారు.

(వాయిస్ బైట్...26 సెకన్లు)

====================

రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలపై ఏర్పాటైన మంత్రుల బృందం ఈరోజు సమావేశమయ్యింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, ఎన్ఎండి ఫరూక్ లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సర్వీస్ ఇనామ్ భూముల పరిష్కారానికి విధానాన్ని రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకుగాను సర్వీస్ ఇనామ్ భూములపై అధ్యయనానికి దేవాదాయ శాఖ అధికారులు, తహశీల్దార్లతో కమిటీ ఏర్పాటు చేసి, 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. అలాగే.. ఫ్రీ హోల్డ్ భూముల విధానాలను సరళీకరించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వివిధ సంస్థలకు భూముల కేటాయింపు విధానంపై చర్చించామన్నారు.

====================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి, ఈ నెల 25వ తేదీ నాటికి మరింత బలపడవచ్చని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నాటికి అది బంగాళాఖాతంలో వాయుగుండంగా మారి, అనంతరం తీవ్ర వాయుగుండంగా మారవచ్చని పేర్కొన్నారు. 27వ తేదీ ఉదయం సమయానికి నైరుతి, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణలో వీస్తున్న ఆగ్నేయ, వాయువ్య గాలుల ఫలితంగా రానున్న మూడు రోజుల్లో నెలకొనబోయే వాతావరణ పరిస్థితులను వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ...

(వాయిస్ బైట్...26 సెకన్లు)

====================

రాష్ట్రంలో ప్రతిభ గల క్రికెట్ క్రీడాకారులను గుర్తించడానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)ను నిర్వహిస్తోందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్బోర్న్ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్ లతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని క్రీడాకారులను ఐపీఎల్ స్థాయికి తీసుకెళ్లడమే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

=====================

=====================